# వెయిటర్ - సర్వర్

[కథానిక]

●

శ్రీ వి. డి. ప్రసాదరావు

శాస్త్రుల్లుసావాసంవల్ల రాజు చెడ్డాడో, రాజు సావాసంవల్ల శాస్త్రుల్లు చెడ్డాడో వాళ్ళ తల్లులకు తెలియలేదు.

ఒకళ్ళ నొకరు ఎరగని తల్లులైతే, పరాయి తల్లి కొడుకే తన కొడుకును చెడగొట్టున్నా డనుకొనేది. వంశగౌరవాభాసలు తప్ప, వంశభాగ్యాలు మిగలక ఆదారిద్ర్యంలో ఆ అమ్మలిద్దరూ ఇరుగుపొరుగున, అన్యోన్యంగా పెరిగారు. కుల మింటిపాటుల్లోనే మొగదిక్కులేని జీవనాలు గడుపుకొంటూ ఆ బ్రాహ్మణ తల్లీ, రాజుతల్లీ పోరుపొక్కులు లేకుండానే గుట్టుగా పల్లెటి జీవనం గడుపుకొంటున్నారు.

శాస్త్రుల్లుతల్లీ కొక్కడే కొడుకు. రాజు చిన్ననాడే, ఒక పెద్దఅప్పగారు, తల్లి గారాబాన్ని, మంచితనాన్ని దుర్వినియోగం చేసి, బీదతనాన్ని చీదరించుకొంటూ, ఆర్థికయోగాని కనువైన బ్రతుక్కు మురిసి, పట్టణంలో రంగేలావీథికి చేరుకుంది. ఆ రాజు తల్లి తోడి యిల్లాలితోబాటు తనకూ కొడు కొక్కడే ననుకొని, కూతురే లేదనుకొని, మనసు రాయిచేసుకొంది అభిమానంతో...

శాస్త్రుల్లుకు తన తల్లి రాజు నెక్కువ ఆదరంతో చూస్తుందనీ, ఏ చిలిపికజ్జాలోనైనా తప్పంతా తన నెత్తినే కట్టుందనీ కోపం. ప్రతీకారంగా రాజు మీద అక్కసు. రాజుకు తన తల్లి, తమ అంతటి బీదదే అయినా ఆ శాస్త్రుల్లుతల్లి ముందర వల్లమాలిన వినయంతో, ఏదో గొప్పవాళ్ళని తక్కువవాళ్ళు చూసినట్లు చూసి, వాళ్ళ అబ్బాయి ఏం చేసినా తనదే తప్పని తనను తిట్టిపోస్తుందనే ఉక్రోషం.

ఇద్దరికీ ఆలోచనకు తెలిసినవి—అక్కసులు, కోపాలు.

కాని ఒక్కనిమిషం రాజు కనబడకపోతే శాస్త్రులుకు తోచేదికాదు. శాస్త్రులు ప్రక్కనుండకపోతే రాజు నిస్పృహు డైపోయేవాడు. ఆ అనురాగం ఇద్దరికీ బుద్ధిగతంగా తెలియదు. కనబడ్డనిముషాన్నించి కొట్టుకొంటూ, తిట్టుకుంటూ, కీచులాడుకుంటూ, ఒకళ్ళమీద ఒకళ్ళు పితూరీలు చెప్పుకుంటూ, ఒకడి కొకడు ఏం అపకారం చెయ్యాలో వెదుకుకుంటూ రోజంతా కలిసే తిరిగేవారు. బడికి వెళ్ళక పోటానికి ఒకళ్ళ కొకళ్ళు కారణం. చెట్లుచేమలు ఎక్కేందుకు, చెరువులో నడిరెండలో ఈతలాడేందుకు, పంతులింటి ముందు పల్లేరుకాయలు పోసేందుకు అన్నిటికీ ఒకళ్ళ కొకళ్లు తోడుండాల్సిందే. పంతాలుపోయి, కొట్టుకోవాల్సిందే!.

ఈ గడుగ్గాయులకోసం తపించి తపించి తల్లులు తనువులు చాలించారు.

బతుకుబాటలు బాల్యం దాటకుండానే పైనబడ్డాయి. ఆ పల్లెకు చదువుసంధ్యలు లేని ఆ గడుగ్గాయలంటే కృతజ్ఞత ఉండాల్సిన అవసరం కనబడలేదు. వాళ్లకూ, నిప్పూ నీరు పుట్టక, పల్లెఅంటే కృతజ్ఞత కనబడలేదు. చిన్ననాడే అక్కయ్య చచ్చిపోయిం దనుకోమన్న తల్లి అభిమానపు మాటల్తో, బంధుత్వం తెంచేసుకొన్న అక్కయ్యదగ్గిరకే మళ్లీ రాజు బయలుదేరాడు. శాస్త్రుల్లు 'ఘూత్'అని ఆతోవ తుంచేసుకొని మరో దోవను పట్టణం చేరుకొన్నాడు.

## ౨

అప్పుడు ఆదరంతో, కన్నీళ్లతో బ్రతిమాలుతూ "చెయ్యరా నాయనా" అని తల్లి తన మంచికి చెప్పిన పనులు ఒక్కటీ ఒక్కనాడూ చెయ్యక, తల్లిని తిట్టూ గడిపాడు శాస్త్రుల్లు.

ఇప్పుడు కోడికూసేటప్పటికే లేచి, విభూతి పెట్టుకొని, అయ్యరు ఆజ్ఞలు ఉరుముతూంటే, అణా కానీ ఇచ్చినవాడల్లా హోటల్లో అధికారం చెలాయిస్తుంటే, కుక్కనపేనులాగా పడిఉండి, బల్లలదగ్గర్నుంచి వంటింట్లోకి, వంటింట్లోంచి బల్లలదగ్గరకు అర్ధరాత్రిదాకా, ఆ కాస్త జాగాలోనే మైళ్లు తిరుగుతూ, కాళ్లూ చేతులూ బలపాలు కట్టి, అయ్యరు ఈసడింపుగా పారేసిన మెతుకులు ఆదరాబాదరగా తింటూ, అర్ధరాత్రికి హోటలువీధివరాండానాప రాళ్ళమీద కొల్లాయి పరుచుకొని, పగలు తిన్న దెబ్బల కలిక్కిపడుతూ, నిద్రలో ఒళ్ళు మరిచి, తెల్లారాక మళ్ళీ అయ్యరు కేకలకు అదటున లేచి పనిలోకి పోతాడు.

అప్పుడు తల్లి ఆదరంగా ఆవరువు లన్నీ చేసి పెడ్తూంటే, కోడి కెలికినట్లు కెలికి, నంజి, విస్తరి చింపి, కేకలతో లేచిపోయేవాడు. ఉన్న ఒక్క మంచమూ, బొంతా తనకే పక్కవేసి, తల్లి కాచుక్కూచుంటే, అర్ధరాత్రికి తిరిగివచ్చి, ధూంధాంలు చేస్తూ, పొద్దెక్కేదాకా పడుకొని గొర్రెట్టేవాడు.

ఇప్పుడవన్నీ జ్ఞాపకాలుగా మరీ ఏడిపిస్తూండేవి. కంటికీ, కడుపుకూకూడా సదరైన తినుబండారాలు తన చేతులమీదుగానే అందరికీ యిస్తూ, తనుమాత్రం మూతికి చిక్కం కట్టిన దూడలాగా అఘోరిస్తూంటే బాధే వేసేది. పైగా, పైసా ఇచ్చిన ప్రతివాడికీ, అయ్యరు కాదు లోకువ, తనే! అటు జనమే తిడ్తారో, ఇటు అయ్యరే తిడ్తాడో క్షణక్షణం మార్పుగానే ఉండేది.

"ఏం, ఈ కాఫీ ఇల్లా తగలడిం దేమయ్యా? నే నిచ్చేది డబ్బుకాదా?"

అయ్యరు ఎటు చెప్తాడో! వాళ్ళ పక్షమో, తన పక్షమో తెలియదు. పోనీ, త్రాగేవాడికి తృప్తిగా ఇంకో కప్పు చేసుకొచ్చిస్తే, అయ్యరు వాళ్ళముందర గౌరవమే చూపించి, తర్వాత ఒంటరిగా "ఎవరమ్మ మొగుడి సొమ్మని ఇచ్చావురా! ధగిడీకా, జీతంలో కట్టుకో!" అని ఉరిమేవాడు. ఆ జీతం లెఖ్ఖల్లో ఎంత ఉన్నా, ఏడాదికి రెండు లాగూలు, చొక్కాల్ని మించి కనబడేది కాదు. అదయినా, హోటలు గౌరవంకోసం, 'సర్వర్' శుభ్రంగా ఉండాలనే ఘరానా కాతాదారుల మెప్పుకోసం. అంతకుమించి బీడీలకుకూడా పైసా ఆడేదికాదు. అదికూడా ఎవరి దగ్గరో ముష్టే.

అల్లా అని మళ్ళీ కాఫీ ఇయ్యకుంటే, కాతాదారు తగువుపెట్టుకొన్నాక—"వచ్చిన వాళ్ళతో పోట్లాడి నా బేరం చెడగొట్టుకొనేందుకురా, నిన్నిక్కడ పెట్టుకొంది? గతిలేనివాళ్ళని తెచ్చుకుంటే బాగానే ఉంది నాకు సాయం!" అని అయ్యరు చివాట్లెట్టేవాడు. తిట్లు పడాల్సిందే తప్ప, మళ్ళీ సరకు ఇచ్చే తెలివి తక్కువకు పోరాదు. దానికికూడా మళ్ళీ అద నెరిగి, అపవాద మెరిగి, ఇస్తూనే ఉండాలి. ఆ అదను అయ్యరు ముఖంలో గ్రహించే మానసికతత్వపరిశోధనాప్రజ్ఞా విశేషం ఆయీడు కింకా అలవడలేదు. ఏ కాతాదారు ఏనిమిషంలో 'ఘరానా' అవుతాడో, ఏ నిమిషంలో 'చెంబేలీ'రకం అవుతాడో తెలియదు. వాళ్ళ ప్రవర్తన కాదు దానికి గీటురాయి. వాళ్లవల్ల అయ్యరుకు కలిగే ప్రత్యక్షలాభాలు. అవి అయ్యరుకూ, వాళ్ళకీ తెలిసే రహస్యాలు.

ఇడ్లెన్లో పచ్చడికీ, సాంబారుకీ ఇరవైమాట్లు తిప్పినా, మంచినీళ్ళకు మరో పదిసార్లు పంపించినా, కాఫీలో డికాక్షనుకు, పంచదారకు, పాలకు, చివరకు సాసర్లకు ఒక్కొక్కడు ఎన్నిమాట్లు తిప్పినా కిమ్మనకుండా తిరగవలసిందే. పాలలో నీళ్ళు ఎక్కువ కలపనందుకు అయ్యరూ, కలిపినందుకు కాతాదార్లూ తిట్టుతూంటే సమంగా భరించవలసిందే. అయినదానికీ, కానిదానికీ అడ్డమైన మాటలూ ప్రతిచిల్లరమనిషీ అంటూంటే, పళ్లెటి గడుగ్గాయి—అభిమానా న్నంతా

పటాపంచలు చేసుకొని కుక్కిన పేనులా ఉండాల్సిందే. మొదటిరోజుల్లో పౌరుషం పొడచూపేటప్పటికి అయ్యరు తల చితగ్గొట్టాడు. బుద్ధిగల గొడ్డుగా తయారయ్యాడు శాస్త్రుల్లు.

3

కొత్త లాగూ, కొత్త చొక్కాతో నీటుగా జేబులో డబ్బులు గలగల్లాడిస్తూ, పదమూడేళ్ళ షోకిల్లా-రాజు హోటలు లోకి వచ్చాడు. ఠీవిగా కుర్చీలో కూర్చొని శాస్త్రుల్లును చూడగానే వచ్చిన అనురాగ పూరితమందహాసాన్ని అణగద్రొక్కుకొని "వెయిటర్!" అని కేక వేశాడు. శాస్త్రుల్లు స్నేహితుడు కనబడేటప్పటికి హోటలనే మాట మరచిపోయి, "...ఏరోయ్" అని పలకరించాడు.

రాజు ఇంకా గౌరవప్రదర్శనఘట్టంలోకి దిగాలనుకొనేలోపలే, ప్రక్కనున్న కాపునాయుడుగారు, ఎంగిలి ముక్కలతో "డామ్ ఫూల్, కష్టమర్స్‌ను హోటల్లో అవమానంగా పిలుస్తావురా! ఏరోయట, ఏరోయ్! వెయిటర్ అంటే నామర్దా అయితే ఆ పని కెందుకొప్పుకొన్నావ్? పుట్టుకతోటే వస్తుందే మీకు ఆ జాతిగుణం!" అంటూ లంకించుకొని, పట్టాలు తప్పించి, తన అభిమానవిషయమైన 'కులద్వేషం'లోకి తిప్పి, ఈ కుర్ర వెయిటరు ఆధారంగా ఉపన్యాసం నడిపాడు. అయ్యరుకూడా ఇట్టే మలిగిపోయి "ఏం? ఇంకా జలుబు కుదర్లేదే? కష్టమర్సుని గౌరవించాలని ఎన్ని మాట్లు చెప్పాలి నీకు?" అంటూ ఉరిమాడు.

శాస్త్రుల్లు చీవాట్లు తింటూన్నందుకు అలవాటుగా వచ్చిన సంతోషంలో, మిత్రుడు కనబడగానే కలిగే ఆదరాభిమానాలు రాజులో మణిగిపోయాయి. శాస్త్రుల్లు రాజును చూడగానే వచ్చిన ఆప్యాయత అంతా ఉడుకుమోతుతనంలో కోపంగా మారి, గ్రుక్కలు మింగటంలో కంఠంలోనే అణగారి, కంటిచూపులో అశక్తంగా వెలువడింది.

ఆ అణన్నరలో ఎంత హోదా చెలాయించుకోవచ్చో అంత హోదా రాజు పూర్తిగా చెలాయించుకొన్నాడు.

"ఏయ్, పచ్చడి తీసుకురా!...ఈ పొడుల్లేవేమిటి? ఇంకోదాంట్లో తీసుకురా...ఈ ఆకులో పురుగులున్నాయి, ఇంకో ఆకులో తే...ఇంకొంచెం పచ్చడి తే...అరగంటైనా మంచినీళ్ళియ్యవేం?... ఎక్కడి నీళ్ళివి, కుడితి తొట్టిలోవా?...వేరే తీసుకురా...ఇంకొంచెం డికాక్షన్ వెయ్యి...అలా అంత పోస్తావేం? మళ్ళీ పాలు ఏవి?...పంచదారేదీ?...... ఒక చెంచా చాలంటే...ఛా! తగలడ్డట్టే ఉంది వెధవకాఫీ..."

శాస్త్రుల్లు, కిమ్మనకుండా, రోజుకుంటూ తిరుగుతూనే భరించాడు. ఆ రాత్రి పడుకోపొయ్యేటప్పుడు వచ్చిన కంటినీరు, రాజుమీద కోపంవల్లో, లోకం మీద కోపంవల్లో తెలియలేదు.

౪

ఆర్థికపరిస్థితి ఎల్లా ఉన్నా, పరంపరాగతమైన నైతిక బుద్ధి అంతరాత్మరూపంలో నిత్యం కుమిలిస్తూ, చిన్ననాటి తల్లి ఆదరము, తమ్ముడిమీద అపేక్ష మధుర స్మృతులుగా అలయిస్తూన్న రాజు అక్కకు, తమ్ముడు కనబడగానే పట్టరాని సంతోష మయింది. వాత్సల్యంతో, ఆదరంతో తమ్ముణ్ణి ముంచెత్తేసింది.

కాని పల్లెటిగడుగ్గాయికి, మంకుతనంలో పెరిగినవాడికి, ఆ ఆదరాభిమానాలే విషప్రాయంగా చిరాకెత్తిచ్చాయి. నాల్గు నాళ్ళతో మొగం మొత్తింది. అక్కయ్యవృత్తికి అక్కయ్య నీసడిస్తూ, (ఆ డబ్బును మాత్రం ఆశిస్తూనే) అక్కయ్యను తిట్ట మొదలెట్టాడు. తన అంతరాత్మతో పోటివిగానే ఆ తిట్లను గౌరవంతో సహించింది. ఆ సహనసీరసం గడుగ్గాయికి మరీ ఉద్రేకం తెప్పించింది. ఏదో చిలిపికారణం పెట్టుకొని, "ఛీ! నీ భోగంతిండి తిన"నంటూ విసవిసా బైటికి వచ్చేశాడు. "నాయనా! ర"మ్మంటూ ఏడుస్తూ బ్రతిమాలుతున్న అక్కయ్యను చీదరించేసుకుంటూ పరుగెత్తాడు.

నాలుగురోజుల ఉపవాసదానంతో పట్టణం సగం అహంకారాన్ని చితగ్గొట్టింది. అక్కయ్యదగ్గిర కెళ్ళటానికి అభిమానంమాత్రం ఇంకా చావలేదు. అయ్యర్ హోటల్లో క్లీనరుగా ప్రవేశించాడు.

౫

"ఏయ్! బల్ల సరిగ్గా తుడవలేదు. ఆ మూల తుడూ!"

'వెయిటర్' శాస్త్రుల్లు 'క్లీనర్' రాజుమీద అధికారం చెలాయిస్తున్నాడు. ఆ ఒక్కరోజు అక్కనూ

నిత్యకృత్యంగా పెంచి, వడ్డీతోసహా తీర్చుకొంటు న్నాడు. శాస్త్రుల్లో అహంకారాన్ని, అభిమానాన్ని చితగ్గొట్టినట్టే, రాజులోకూడా అభిమానాన్ని, అహంకారాన్ని అయ్యరు చితగ్గొట్టాడు. అయ్యరు తనకు ప్రసాదించిన బహుమానాలన్నీ శాస్త్రుల్లు రాజుకు ప్రసాదించి, కసితీర్చుకొంటున్నాడు. అయ్యరు దూరంగా ఉన్నప్పుడు ఇద్దరూ కలబడేవారు. మళ్లీ ఆ రాక్షసుడి కేకతో ఒకళ్ళమీద ఒకళ్లు ఉక్రోషక్రోధాల్లోనే,తమ పనుల్లో ఉన్నట్లు తమ ఉండేవాళ్లు. ఒకళ్ళ మీద ఒకళ్లు అయ్యరుకు పితూరీలు చెప్పేందుకు అన్ని అవకాశాలూవినియోగించుకొనేవారు.అయ్యరుచేతుల్లో రెండవవాడికి దెబ్బలు తగల్తున్న నిమిషాన్ని మించి సంతోషసమయం వేరే ఏదీ ఇద్దరికీ ఉండేదికాదు.

* * * *

రాత్రి ఎనిమిదింటికి ఘరానాకాతాదార్ల మెప్పు కోసం వెయిటర్ శాస్త్రుల్లు కీనరు రాజును కేకలేస్తు న్నాడు. పొద్దున్నే విడిగా కలబడి ఇద్దరూ తన్ను కున్నారు. ఆ ద్వేషం ఉద్యోగధర్మాల్లో తీరు తూంది.

శాస్త్రుల్లు ప్లేటుతో నిలబడి, "బల్ల తుడవ్వేరా ఎంతసేపటికీ! బద్మాష్" అని రాజుమీద కేకలేశాడు. అంతకుముందే బాల్చీతో నీళ్ళు తెస్తూ, బరువుకు బోర్ల బడి మోకాళ్లు చెక్కుకుపోయి, గాయాలు నిమురు కొంటున్నాడు రాజు. అలుకుగుడ్డ పుచ్చుకొని బల్ల దగ్గర కొచ్చి, కాలు నిమురుకొంటూ నెమ్మదిగా తుడవబోతున్నాడు.

శాస్త్రుల్లు "ఎంతసేపురా నిలిచేది!" అని మళ్ళీ అరిచాడు.

రాజుకు భరించే స్థితి దాటుతూంది. తుడవటం ఆపి నిలబడి, శాస్త్రుల్లువంక ఉరిమి చూశాడు. శాస్త్రుల్లు ధీమాతో "మిడిగుడ్లేసుకుని అల్లా చూస్తావేరా తుడవక" అంటూ సాగించాడు.

రాజు చేతిలో ఉన్న గుడ్డ శాస్త్రుల్లుమొహా న్నేసి కొట్టాడు. శాస్త్రుల్లు చేతిలో ప్లేటు రాజుమీదికి విసిరికొట్టాడు. ఇద్దరూ కలబడ్డారు. బల్లలు గగ్గోలయ్యాయి.

అయ్యరు యిద్దరిజుట్టూ లంకించుకొని దొడ్లోకి ఈడ్చుకువచ్చి, స్మృతి తప్పేదాకా ఇద్దరికీ బడితపూజ చేసి, "పీడ విరగడై పొండి వెధవల్లాలా!" అంటూ ఇద్దరినీ పెరడావతల పెంటకుప్పమీదికి విసిరేశాడు.

* * *

తెల్లవారేసరికి పెంటకుప్పమీద ఇద్దరికీ స్పృహ వచ్చింది. ఆ బాధలో, ఆ ఒళ్ళు తెలియని స్థితిలో, అంతర్స్రవంతిగా మనస్సుకు తెలియకుండా హృదయంలోమాత్రమే అణిగున్న పరస్పరానురాగం ఎప్పుడు ఉబికి, ఒకర్నొకర్ని దగ్గర కీడ్చిందో ఏమో! ఒకర్నొకరు కౌగిలించుకొంటూ నిద్రలేచారు.

"రాజూ!"

"శాస్త్రుల్లూ?"

ఆ కన్నీళ్లల్లో, బాల్యంనుంచీ పైపూతగా దళ మౌతున్న ద్వేషం కరిగిపోతోంది.

కన్ను తెరుస్తూ లేవబోయారు. రాజు కాళ్ళ దగ్గర పాదాలమీద చేతు లేసుకొని శోషతో పడిపోయినట్లు వాడిపోయి కుప్పగా పడిఉంది అక్క! నాలుగు నాళ్లబట్టి తమ్ముళ్ళని వెదుకుకుంటూ తిండీ తిప్పలూ లేక ఊరంతా తిరిగితిరిగి శోషిల్లి ఈ పెంటకుప్పదగ్గర తమ్ముడి కాళ్లమీద చేతు లేసుకొని పడిపోయింది.

శాస్త్రుల్లు రాజును చుట్టకొన్న చేత్తోనే అద రాగా లేచి "అక్కయ్యా!" అన్నాడు.

రాజు మొహం చెల్లనట్లు తలవాల్చి కన్నీరు కారుస్తున్నాడు.

అక్క రాజును చూసి, నీరసంగా అంటూంది: "నాయనా, అన్నం తిందుగాని రా! భోగం తిండి కాదు నాయనా! వృత్తి మానేశాను! దా పోదాం! శాస్త్రుల్లూ! రావా నాయనా!"

నాలుగురోజుల ఆవేదనా కంఠాన్ని పూడ్చివేసి, కన్నులను కరిగించేస్తోంది!

రాజు సిగ్గుతో తల వాల్చి ఉన్నాడు.

శాస్త్రి రెండు నిమిషాలు వెల్లబోయిచూశాడు. రాజును లేవదీసుకొంటూ అక్క కౌగిలిలోకి కదిలాడు.

"అక్కా,పద పోదాం—మన ముగ్గురికీ లోకమే మారిటితల్లి గా పరిణమించింది. మనకి మనమే దిక్కు. రాజూ, పద పోదాం!" అంటూ కదిలాడు.

ఆ ఆదరణలలో మళ్ళీ తెల్లవారింది.